మినీకథ

# చలిమిడిముద్దలు

"నీ చిన్ని నవ్వు నన్ను చిత్తు చిత్తు చేస్తోంది."

తాను వ్రాసిన కవితకి నిజమైన అనుభూతిని ఆ క్షణంలో పొందాడు యువకవి నరేంద్ర. కారణం- అరగంట నుంచీ అతడి తంటాల్ని గమనిస్తున్న 'ఆమె' అతడికేసి తిరిగి చిన్నగా నవ్వడమే!




మెస్ మూసివేసే టైమ్ అయిపోవస్తున్నా భోజనానికి వెళ్ళకుండా ఆమెనే చూస్తూ బస్టాండ్‌లో వుండిపోయాడు ఆ కుర్ర లెక్చరర్.

అతడి అంచనాలు ఆమె గమ్యానికి అందడంలేదు.

ఎన్నో బస్‌లు వస్తున్నాయి. కాని వచ్చిన ప్రతి బస్సూ ఆమె లేకుండానే వెళ్ళిపోతోంది. చేతిలోని మాగజైన్‌లోకి చూస్తూ ఇంకోసారి నవ్వింది ఆమె.

"పాలపుంత"

ఆమె పలువరసని చూసి గొణుక్కున్నాడు.

శీతాకాలపు చలిగాలి రివ్వున కొడ్తోంది. ఎగిరెగిరి పడ్తున్న ముంగురుల్ని ఎడం చేత్తో పైకి తోసుకుంటూ, వయ్యారంగా పైటని సర్దుకొందామె.

"దాహం"

కట్టుకొన్న చేతుల్ని మరింత గట్టిగా బిగిస్తూ గొణిగాడు.

పెళ్ళిచూపుల పేరిట నరేంద్ర ఎందరో అమ్మాయిల్ని చూశాడు. చదువుకున్నవాళ్ళలో అందం తక్కువయింది. అందం వున్నచోట చదువు లేదు. అందం, చదువు వున్న అమ్మాయిల్లో తెలివితేటలు కరువయ్యాయి.

అతడికి కావాల్సిన అన్ని అర్హతలూ వున్న ఒకామె తాను తెలుగు లెక్చరర్‌ని పెళ్ళిచేసుకోనని ఖచ్చితంగా చెప్పేసింది.

విసుగెత్తిన అతడి తల్లిదండ్రులు తగ్గ పిల్ల కనబడ్డాకనే తమకి తెలియచేయమన్నారు. అప్పట్నుంచీ ఖాళీ దొరికినప్పుడల్లా అమ్మాయిల వేటలో పడ్డాడు నరేంద్ర.

అందంలో అతడి కావ్య నాయికా లక్షణాల్ని గల్గి వుందామె. అందుకే ఆకలిని కూడా మర్చిపోయి ఆరాధనలో మునిగిపోయాడు.

"ఎంత స్వచ్ఛమైన అందం! చూసేకొద్దీ చూడాలనిపించే ఈమె దేవకన్యా? ప్రకృతి పిల్లా?" ప్రక్కకి తిరిగి ఒక ఓరచూపును విసిరినట్టే విసిరి వెనక్కు లాగేసుకొందామె.

"వెన్నెల్లో మెరుపులు"

తాపాన్ని ఆపుకోలేక కొంచెం పెద్దగానే గొణిగాడు.

"అబ్బే రైన్ (వర్షం) రాదండీ!" అతడితో మాట కలపాలని, ప్రక్కనే నిలబడ్డ ఓ సేల్స్ రిప్రజెంటేటివ్ అన్నాడు.

ఇహంలో కొచ్చిన నరేంద్ర అతడికేసి తిరిగి ఒకసారి నవ్వేసి, తనని ఎవరైనా గమనిస్తే బాగుండదని అక్కణ్ణుంచి కదిలాడు.

ఈసారి ఆమెకి ఎదురుగా పది అడుగుల-దూరంలో నిలబడ్డాడు నరేంద్ర. ప్రక్కనే వున్న చేపల బుట్ట వాసన వేస్తున్నా, చుట్ట కంపు కొడ్తున్నా అతడు అక్కడ్నుంచి కదల్లేదు.

అక్కడికి ఆమె పూర్తిగా, స్పష్టంగా కనబడటమే కారణం.

నరేంద్రకేసి నిర్లక్ష్యంగా చూసి, మెడను పావుకొంది ఎడంచేత్తో సుతారంగా ఆమె.

"నగలు ధరించడానికి భయపడే నగర సౌందర్యమా ఆమెది?" ముక్కుకు కర్చీఫ్ అడ్డెట్టుకొని ఆలోచిస్తున్నాడు ఆమె కేసి చూస్తూ.

"సృష్టికర్త తీర్చిదిద్ది కాబోయే భార్యను తన కళ్ళముందు నిలబెట్టాడా? అరె- అలా పెదవి కొరక్కు. ఎంత 'నీది' అయితే మాత్రం, అంత అందమైన పెదవిని బాధిస్తావా చెలీ!"

బెదురు చూపులతో అరక్షణంపాటు తల.. గిరున త్రిప్పి చుట్టూ చూసింది ఓసారి.

"భూకంపం! తలలోని మల్లెలన్నీ వణికిపోతున్నాయ్!"

అతడి ఆలోచనలు అలా సాగిపోతూనే వున్నాయి.

"తన కలల్లోని మొన్నటి ముగ్ధ, నిన్నటి సింగారాల సుద్ద ఈమేనా?"

ఆమె హేండ్‌బాగ్‌ని సర్దుకొని అతడికేసి అడుగు లేసింది.

గుండె దడ, దడ మంటూండగానే ఆ అడుగుల్ని లెక్కిస్తూ ఇంకా భావుక హృదయంతోనే ఆలోచిస్తున్నాడు.

'నేటి వయ్యారాలకి వియ్యపురాలా ఈమె?'

"ఉప్పు సేపలెల్లా ఇత్తన్నావమ్మా!"

అదిరిపడ్డాడు నరేంద్ర ఆమె అడిగిన తీరు చూసి.

'ఛ! ఛ! అయినా తనది ఇంత చీప్ టేస్టా? మట్టి అంటిన మాణిక్యం తనకెందుకు?' ఆలోచనలతో అప్పటికే బస్టాండు నొదిలేశాడు నరేంద్ర. ఆ పూటకి అరటిపళ్ళే అతని ఆహారం.

'మెట్రిక్ డింకీలు కొట్టి కూడా, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌లా వెలిగిపోయావ్ ఈ కాస్సేపూ. పదహారణాల ఓ తెలుగుపిల్లా! నీ కిలాంటి తెలివితేటలున్నందుకు నవ్వనా? ఏడ్వనా?' ముందునుంచీ వాళ్ళని గమనిస్తున్న ఆ సేల్స్ రిప్రజెంటేటివ్ మనసులోనే వాపోయాడు.

రేటు అడిగి ఏమీ పట్టనట్టుగా వెళ్ళిపోతున్న ఆమెకేసి ఆశ్చర్యంగా చూసింది చేపలమ్మే అవ్వ.

అల్లరిగా తనలో తాను నవ్వుకొంటూ అప్పుడే వచ్చిన బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ కేసి నడిచింది మిస్. నిర్ణయ, ఎమ్.ఎ. (సైకాలజీ) ●